## క్లుప్తంగా

### అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో జాతీయ స్థాయికి విద్యార్థుల ఎంపిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు అబాకస్, వేదిక్ మాథ్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ వారు ఆదివారం నిర్వహించిన వేదిక్, అబాకాస్ స్టేట్ లెవెల్ పోటీల్లో పిట్లం బ్లూ బెల్స్ హై స్కూల్ విద్యార్థులు సాయి శ్రీ, రిఖిల్ గౌడ్, అశ్విత్‌లు విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

### ఆలయానికి విరాళం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విద్యానగర్ విశ్వనాథేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఏపీ డ్రగ్స్ యజమాని గజవాడ రవికుమార్ ఆదివారం లక్షా ఒక వేయి ఒక వంద ఒక రూపాయి విరాళం అందజేశారు. కార్యక్రమంలో శ్రీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**చాముండేశ్వరి దేవాలయానికి..**



దోమకొండ: మండలంలోని చాముండేశ్వరి దేవి దేవాలయంలో అమ్మవారి రాజగోపుర నిర్మాణానికి బోడపుంటి సురేఖ, కాశీనాథ్ దంపతులు రూ.10,116ను విరాళం ఇచ్చారు.ఆదివారం ఆలయ చైర్మన్‌కు నగదును అందజేశారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బాన్సువాడ రూరల్: కొయ్యగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి నెలకొనడంతో స్పందించిన ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి కేవ్లానాయక్ తండా అంగన్‌వాడీ సెంటర్ వద్ద బోరుబావి తవ్వకం పనులు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పల్లె ప్రకృతి వనం, తాగునీటి అవసరాలకు నీళ్లు ఉపయోగపడుతాయన్నారు. పంచాయితీ కార్యదర్శి రాహేలాబేగం, నాయకులు తార్యానాయక్, రతన్, అంబర్‌సింగ్ తదతరులు పాల్గొన్నారు.

**చిల్లర్గి గ్రామంలో ..**



పిట్లం(జుక్కల్): చిల్లర్గి గ్రామ హరిజనవాడలో ఆదివారం మాజీ జెడ్పీటీసీ మురళీగౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నూతన బోరు బావి తవ్వకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళిగౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ నిధులతో బోరు బావి తవ్వించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ సాదక్, కుమ్మరి ఈశ్వర్, బాలయ్య, చాకలి హన్మండ్లు, సంతుగౌడ్, నాగేందర్ పాల్గొన్నారు.

### దళిత బంధు నిధులు విడుదల చేయాలని వినతి



రాజంపేట/కామారెడ్డిటౌన్: దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేసినట్లు జిల్లా దళిత సంఘాల నాయకులు తెలిపారు. జిల్లాల వారీగా ఎన్నికైన మొదటి, రెండవ విడతలలోని లబ్ధిదారుల వివరాలు సేకరించి త్వరలో న్యాయం జరిగేలా చూస్తానని భట్టి విక్రమార్క చెప్పినట్లు దళిత నేతలు తెలిపారు. కంకణాల రవీందర్, స్వామి, నర్సింలు, వెంకటేష్ లు తెలిపారు.

# మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



మోడెగాం శివారులో గల మూల మలుపు



ధర్మారావ్‌పేట్ గ్రామ శివారులో ..

- కనిపించని సూచిక బోర్డులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇటీవల గ్రామాల్లో బీటీ రోడ్లు, పెద్ద ఎత్తున బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు. అంతా బాగానే ఉన్నప్పటికి మలుపుల నిర్మాణంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా రోడ్లు నిర్మాణం చేపట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ధర్మారావ్‌పేట్, మోడెగాం, కుప్రియాల్ గ్రామాలకు వెళ్లేందుకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డులో మూల మలుపులే అధికంగా కనిపిస్తున్నాయి. సదాశివనగర్ మండలం నుంచి తాడ్వాయి మండలానికి తక్కువ కిలోమీటర్ల దూరంలో త్వరగా చేరుకోవడానికి వేసిన బీటీ రోడ్డు కాస్త ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. మండల కేంద్రం, ధర్మారావ్‌పేట్ శివారు, రెన్యూ సోలార్ పవర్ ప్లాంట్ నుంచి కుప్రియాల్, కాలోజీ వాడి గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల కొంత దూర భారం తగ్గింది. కానీ మూలమలుపులతో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని ఆయా గ్రామాల వాహనదారులు పేర్కొంటున్నారు. అనుకూలంగా ఉన్న చోట కూడా మూల మలుపును తగ్గించకుండా అలాగే రోడ్డు వేయడం వల్ల వాహనదారులకు ముందు వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులను తగ్గించాలని పలుమార్లు వేడుకుంటున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు సంభవించకముందే మలుపులను తగ్గించి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరూ త్రికాల సంధ్యను ఆచరించాలి



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరూ వారి నిత్య జీవితంలో త్రికాల సంధ్యను ఆచరించాలని స్వాధ్యాయ పరివారం సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణంలోని విఠలేశ్వరుడి ఆలయంలో వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా స్వాధ్యాయ పరివారం సభ్యులు మాట్లాడుతూ.. దాదాజీ విచారాల ప్రకారం ప్రతి ఒక్కరు వారి జీవితంలో ఉదయం లేచిన నుంచి సాయంత్రం వరకు చేసుకునే పనులలో భాగంగా త్రికాల సంధ్యను ఆచరించాలని అన్నారు. ఉదయం నిద్ర లేవగానే కరాగ్రే వసతే లక్ష్మీ పఠన, భోజన సమయంలో యజ్ఞశిష్ట శ్లోకం, నిద్రించే సమయంలో కృష్ణాయ వాసుదేవాయ శ్లోకాలను పఠించాలని అన్నారు. స్వాధ్యాయ పరివారం సభ్యులు శ్రీనివాస్, కృష్ణ, ఈశ్వర్, సంతోషి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మకు బోనాల ఊరేగింపు



బోనాలు ఊరేగిస్తున్న గంగపుత్రులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద చెరువు శ్రీగంగమ్మ దేవాలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవ మూర్తులు, బోనాలు, చేపల వలల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా ఆలయం వద్దకు డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించి గంగమ్మకు బోనాలను సమర్పించారు. అనంతరం శివగంగా కల్యాణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించా రు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, సంఘం నాయకులు లక్ష్మినారాయణ,దువ్వలనారాయణ పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరాలయంలో శివస్వాముల పడిపూజ



పడిపూజ చేస్తున్న శివస్వాములు



దేవునిపల్లిలో మహా పడిపూజ..

ఎల్లారెడ్డి: పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో ఆదివారం శివస్వాముల పడిపూజ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అల్పాహారం అందించిన కౌన్సిలర్ శ్రీకాంత్‌ను స్వాములు సన్మానించారు. ఆలయ పూజారి సంగమేశ్వరప్ప, నీలకంఠం, గురుస్వాములు తదితరులున్నారు.

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లిలో ఆదివారం మల్లికార్జున సిండికేట్ ఆధ్వర్యంలో మహా పడిపూజోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు భుజంగరావు, గట్ల బాలుతో పాటు 120 మంది శివ మాలాధార స్వాములు పడిపూజ ఉత్సవంలో పాల్గొని అభిషేకాలు, అర్చనలు చేశారు. అర్చకులు జంగం వికాస్, శివాలయ కమిటీ ప్రతినిధులు నారాయణరావు, లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

**రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవం**

దోమకొండ: ముత్యంపేట గ్రామంలోని రేణుకాదేవి ఆలయ 60వ వార్షికోత్సవం నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తగారి శిరీష్ గౌడ్ తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయన్నారు. ఆదివారం ఆలయంలో వారికోత్సవ పత్రికలను ఆవిష్కరించారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్నపోశగౌడ్, ఎ స్వామిగౌడ్, ఎం మోహన్‌గౌడ్, ఎం సిద్దాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**భిక్కనూరు రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయం..**

భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయం 48వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రైతులు ఎడ్ల బండ్ల ప్రదర్శనను నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

**శ్రీ కృష్ణ ధ్యాన మందిరం వార్షికోత్సవం**

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రం అశోక్‌నగర్ కాలనీలోని శ్రీ కృష్ణ ధ్యాన మందిరం 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారతీయ మహానుభావు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు గాంధారికర్ బాబా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ వనిత, జైపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

**మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి**

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలోని కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి అర్చనలు,అ భిషేకాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

**నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్ గ్రామంలో సోమవారం నుంచి ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభించనున్నట్లు వీడీసీ చైర్మన్ దొడ్లె రవి తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### క్రీడలను ప్రోత్సహించాలి



బీబీపేట: యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి వారిని ప్రోత్సహించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ అన్నారు. రెండు రోజులుగా తుజాల్‌పూర్‌లో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. తుజాల్‌పూర్ టీం విజేతగా ..రామాయంపేట జట్టు రన్నర్‌గా నిలిచింది. వారికి నగదు బహుమతులను ప్రేమ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో స్వామి, రవీందర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నేడు(26న) గర్గుల్ గ్రామంలోని పీపుల్ ఫర్ ఇండియా భవన సముదాయంలో నిర్వహించే ఉచిత కంటి శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్ కోరారు. ఆదివారం గర్గుల్‌లో వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. కంటి సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని యూనియన్ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎజాజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా మాజీదుల్లాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఖలీల్, రెహమాన్, సలీం, రాజు, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

### విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి



భిక్కనూరు: కామారెడ్డి జిల్లా కేంద్రంలో మార్చి 1న నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ భిక్కనూరు మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన రామేశ్వర్‌పల్లిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఈ యాత్రలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు. నేతలు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, రమేష్, సిద్ధరాములు పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చూపాలి



కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీటీసీ శ్రావణి తదితరులతో ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానం నుంచి పోటీచేసే కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ అందించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం బాన్సువాడలోని ఆయన నివాసంలో జహీరాబాద్ పార్లమెంట్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి సమక్షంలో బోర్లం ఎంపీటీసీ పెద్ద పట్లోళ్ల శ్రావణి, ఆమె భర్త దేవేందర్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఏనుగు రవీందర్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఎంపీటీసీ శ్రావణీ దేవేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన బోర్లంక్యాంపు ఉప సర్పంచ్ కొండ సాయిలు, వివిధ కులాలకు చెందిన పలువురికి కాంగ్రెస్ కండువాలు కప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూనిపూర్ రాజిరెడ్డి, కొత్తకొండ భాస్కర్, నార్ల సురేష్ గుప్తా, మధుసూదన్‌రెడ్డి, రూప్‌సింగ్, రతన్, వెంకాగౌడ్, సతీష్‌గౌడ్, రాణి జనార్దన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సంగోజీపేట్‌లో బహిరంగ సభ..**

సంగోజీపేట్‌లో భారీ ర్యాలీ అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ ఈడ్గి లక్ష్మీ శంకర్‌గౌడ్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంగమేశ్వర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

## యోగాను జీవితంలో అలవాటుగా చేసుకోవాలి



రాంరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరు యోగా, ధ్యానాన్ని నిత్యజీవితంలో అలవాటుగా చేసుకోవాలని యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అన్నారు. కామారెడ్డి పతంజలి యోగా సమితి ఎస్ఎస్‌వై యోగా కేంద్రం 15వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక యోగా జిల్లా భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా యోగా గురువులు రాంరెడ్డి, గరిపల్లి అంజయ్య గుప్తా, పెద్దిగాడి అంజయ్య, యెల్లంకి సుదర్శన్ తదితరులను సన్మానించారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు బి.రఘుకుమార్, ఎస్.ఈశ్వర్, బి.గంగారెడ్డి, కర్ణశ్రీ, హిమబిందు, కే.సిద్ధాగౌడ్, ఎల్లయ్య, రాములుయాదవ్, వెంకటస్వామి, హరిత, రమ్య, భాగ్యలక్ష్మి, సంధ్య , ఇంజమూరి శ్రీనివాస్, గాంధారి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తానాజీరావు, అశోక్‌నగర్ కౌన్సిలర్ అవధూత నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కామారెడ్డి టౌన్: ప్రైవేట్ జూనియర్ కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్‌లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివప్రసాద్ ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల పేరిట విద్యార్థులు, తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి కళాశాల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేందర్, సంపత్, వీరేందర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

బాన్సువాడ: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి హనుతేజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుందని, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని అన్నారు. బడ్జెట్‌లో విద్యాశాఖకు 30 శాతం నిధులు కేటాయించాల్సింది పోయి 7 శాతం నిధులే కేటాయించడంలో ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు. నాయకులు జశ్వంత్, నగేష్, రాకేష్, అభిషేక్, సిద్ధు తదితరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మత్తమాలలో పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ఊషాగౌడ్



సంతాయిపేట్‌లో..

పిట్లం(జుక్కల్): అల్లాపూర్‌లో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మాండ్లు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. ఈజీఎస్ రూ.10 లక్షల నిధులతో ఈ సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మాజీ జెడ్పీటీసీ మురళీగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిరెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లేశం, విట్టల్, లింగం, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

**మత్తమాలలో..**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాలలో సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ ఊషాగౌడ్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

**సంతాయిపేట్‌లో..**

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంతాయిపేట్ శివారులోగల భీమేశ్వరాలయం వద్ద సీసీ రోడ్డు పనులను ఆదివారం నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రూ.15 లక్షలు కేటాయించారని తెలిపారు. నాయకులు సుగుణాకర్‌రెడ్డి, షౌకత్‌అలీ, శ్యాంరావు, బాలకిషన్‌రావు, ప్రవీణ్, భాస్కర్, సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పిట్లం(జుక్కల్): వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పిట్లం శివారులో వాహనాల తనిఖీలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేనివారికి జరిమానా విధించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ..వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, చౌరస్తాల వద్ద నెమ్మదిగా వెళ్లాలని అన్నారు. ఏఎస్సై లింబాద్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**ఎల్లారెడ్డిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో నేడు ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. పట్టణ శివారులో విద్యుత్ తీగలకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

**ఘనంగా పాఠశాల వార్షికోత్సవం**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. యువజన సంఘాల సభ్యులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ముమ్మరంగా చెరుకు క్రషింగ్**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి 3 లక్షల 13వేల 74 టన్నుల చెరుకు క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

**మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుపై హర్షం**

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల జీవో–317 సమస్యపై అధ్యయనం కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుపై తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పంపరి ప్రవీణ్ కుమార్ ఆదివారం పేర్కొన్నారు. మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**సామాజిక సేవ కార్యక్రమాల్లో రోటరీ క్లబ్**



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలో 49 సంవత్సరాలుగా రోటరీ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని స్థానిక రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పోలబోయిన సత్యం, పి.రాజనర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రోటరీ ఆడిటోరియంలో క్లబ్ వార్షికోత్సవం నిర్వహించారు. గర్గుల్, ఉప్పల్‌వాయి, బీబీపేట, ఓరియంటల్ పాఠశాలలకు చెందిన పేద విద్యార్థులు ఐదుగురికి ఉచితంగా సైకిళ్లను అందజేశారు. క్లబ్ ప్రతినిధులు శ్రీశైలం, ఎస్.కాశీనాథం, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

**తెరవే మహాసభలకు తరలివెళ్లిన జిల్లా ప్రతినిధులు**



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) 8వ రాష్ట్ర మహాసభల సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు తెరవే ప్రతినిధులు, కవులు, రచయితలు ఆదివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్, ప్రతినిధులు ధర్పల్లి సాయికుమార్, గంగాప్రసాద్, బి.నాగభూషణం, మందపీతాంబర్, కాసర్ల రామచంద్రం, సూరారం శంకర్, తదితరులున్నారు.